పాఠశాలకు క్రీడా పరికరాలు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు పుణ్యవతి, వసుధా, మోహన్‌రావు విద్యార్థులకు క్రీడా పరికరాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఒత్తిడి దూరమై శారీరకంగా దృఢత్వం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలతో విద్యార్థులు

చిరుధాన్యాలతో ఆరోగ్య సిరి : కలెక్టర్

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిపూజ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయచోటి

అనేక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలతో సమాజంలో ఆరోగ్య సిరి పెంపొందుతుందని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలో మొత్తం రూ.2958.69 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏడు పరిశ్రమల యూనిట్లు, 6 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 13 సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభోత్సవం, భూమిపూజ శిలాఫలకాలను ఆవిష్కరించారు. జిల్లాకు సంబంధించి పీలేరు మండలం గూడరేవులపల్లిలో రూ.4.41 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాయచోటి కలెక్టరేట్ లోని స్పందన హాల్లో జరిగిన ఈ వర్చువల్ కార్యక్రమంలో కలెక్టర్ గిరీష, పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజులు పాల్గొన్నారు. వర్చువల్ కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరముగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇచ్చి రైతులను చిరుధాన్యాల సాగు పెంచే విధంగా ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే నేడు పీలేరు నియోజకవర్గం గూడరేవులపల్లిలో రూ.4.41 కోట్ల ఖర్చుతో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ కు ముఖ్యమంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారని చెప్పారు. ఈ ప్రతిపాదిత యూనిట్ యొక్క స్థాపిత సామర్థ్యం రోజుకు ఆరు టన్నులుగా ఉంటుందని, ఈ యూనిట్ ద్వారా దాదాపు 20 మందికి ప్రత్యక్షంగా ఉపాధి, పరోక్షంగా మరో 2000 మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఈ సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా వివిధ రకాల చిరుధాన్యాల పిండి, గంజి, బేకింగ్ కుకీస్, మిల్లెట్ రేకులు, వెర్మిసెల్లి, నూడిల్స్, ఫోర్టిఫైడ్ మిల్లెట్ వంటి మంచి మార్కెట్ విలువ కలిగిన వివిధ ద్వితీయ ఉత్పత్తులను ప్రాసెస్ చేయడమే ఈ ప్లాంట్ యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు. రైతులందరూ చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మన పూర్వీకుల ఆరోగ్యాన్ని, బలాన్ని పరిశీలిస్తే వారు కష్టపడి పని చేసేవారు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేవారని తెలిపారు. ప్రస్తుత కాలంలో శారీరక కష్టం తగ్గింది. అంతేకాక నాజుకు తిండి తినడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు ఆహారపు అవసరాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులు మారుతున్న వాతావరణ పరిస్థితులలో నాణ్యమైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలన్న ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడంపై దృష్టి సారించి ఈ దిశగా చర్యలు తీసుకుని అమలు చేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలో చిరుధాన్యాల సాగు పెంపుకు కృషి చేస్తున్నాం అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిరుధాన్యాలు ఎంతగానో తోడ్పడుతాయని వ్యవసాయం దాని అనుబంధ రంగాలను బలోపేతం చేయడానికి ఒక రైతు బిడ్డగా ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పీలేరు మండలం గూడరేవులపల్లిలో రూ.4.41 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరుధాన్య పంటలకు సంబంధించిన రైతులకు అందించనున్న మద్దతు ధర ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ చంద్ర నాయక్, జిల్లా మార్కెట్ కమిటీ అధికారి త్యాగరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు ఉక్కపోత!

- కాన్పుల వార్డులో ఇక్కట్లు
- వెయిటింగ్ హాలుకు బాలింతల పరుగులు
- పట్టని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రికి పురిటినొప్పులు తప్పడం లేదు. రాయలసీమ జిల్లాల నుంచి జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్య సేవల నిమిత్తం ప్రతిరోజూ వందలాది రోగులు రావడం తెలిసిందే. సుఖప్రసవాల సేవలు మెరుగుపడిన నేపథ్యంలో గర్భిణులు తాకిడి గణనీయంగా పెరిగింది. ఇటువంటి పాజిటివ్ పరిస్థితుల నేపథ్యంలో లేబరువార్డు, కాన్పులవార్డుల్లో మౌలిక వసతులను కల్పించడంలో జిజిహెచ్ అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవ హరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రి మౌలిక వసతుల కల్పనలో నీరస పడింది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో లేబర్, కాన్పుల వార్డుల్లో ఉక్కపోతను భరించలేని గర్భిణులు, బాలింతలు వెయిటింగ్ హాలుకు రోజుల వ్యవధిలోని పిల్లలను తీసుకుని బారులు తీరుతున్న దృశ్యం కనిపించింది. జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సుఖప్రసవాల సేవలు గణనీయంగా మెరుగు పడిన నేపథ్యంలో ప్రతి రోజూ వందలాది మంది గర్భిణులు రావడం సర్వసాధారణమైంది. వైద్యసేవల అనంతరం ప్రతిరోజూ సుమారు 40 నుంచి 50 సుఖ ప్రసవాలు చేస్తున్నారు. ఇదే సేవలకు ప్రయివేటు, కార్పొరేట్ ఆస్ప త్రిల్లో ఒక్కో సుఖప్రసవానికి రూ.30 వేలు, ఆపరేషన్ అవసరమైన వారికి రూ.50 వేలకుపైగా ఛార్జీలు వసూలు చేస్తున్న నేపథ్యంలో పేదలతోపాటు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి ప్రభుత్వ సర్వ జనాస్పత్రి బారిన పడుతుండడం గమనార్హం. ఇటువంటి పాజిటివ్ పరిస్థితుల నేపథ్యంలో జిజిహెచ్ యంత్రాంగం వైద్యసేవల మీద కల్పించిన నమ్మకం, మౌలిక వసతుల కల్పనలో కల్పించడం లేదని చెప్పవచ్చు. తరుచుగా ఫ్యాన్‌లు ఎసి యంత్రాలను అప్‌డేట్ చేయక పోవడంతో తరుచుగా మరమ్మతుల బారిన పడుతున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఒకే బెడ్ మీద ఇద్దరు, ముగ్గురు బాలింతలు ఉండి సేవలు పొందడానికి సిద్ధ పడు తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో గర్భిణులకు మౌలిక వసతుల కల్పనపై జిజిహెచ్ యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తరుచుగా పనిచేయని ఫ్యాన్‌లు, ఎయిర్ కండిషన్ యంత్రాల నేపథ్యంలో బాలింతలు పురిటి బిడ్డలను వెయింటింగ్ హాలుకు తీసుకొచ్చి గుడ్డల సహాయంతో విసురు తూ పిల్లలను ఉక్కపోత బారి నుంచి తప్పించే ప్రయత్నం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనిపై లేబర్‌వార్డు హెచ్‌ఓడిని సంప్రదిం చగా ఫ్యాన్స్, ఎసిలు సక్రమంగా పని చేస్తున్నాయని, బాలింతలు ఎం దుకు బయటికి వెళ్తున్నారో పరిశీలిస్తామని చెబుతున్నారు. బాలింతలు బెడ్ మీద నుంచి బయటికి రావడానికి సెక్యూరిటీ ఏమైందని, పిల్లలు, బాలింతలు ఇన్‌ఫెక్షన్ బారిన పడితే పరిస్థితేమిటని ప్రశ్నిం చగా సెక్యూరిటీని పటిష్టం చేస్తామని పేర్కొనడం గమనార్హం. దీనిపై సూపరింటెండెంట్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ఉక్కపోతతో రిమ్స్‌లో ఆరుబయట నిద్రిస్తున్న బాలింతలు, రోగులు

ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పిస్తున్న వామపక్ష నాయకులు

ఎస్‌సి, ఎస్‌టిలకు భూములు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఓబులవారిపల్లి మండలంలోని బాలిరెడ్డిపల్లి పంచాయతీలో గల నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు సాగుభూమి మంజూరు చేయాలని సిపిఎం ఓబుల వారిపల్లె మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఆదివారం రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సి.రవికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జయరాం పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిరెడ్డిపల్లి పంచాయతీలోని ఎస్సీ ఎస్టీల అనుభవంలో ఉన్న సర్వేనెంబర్ 1155 లో 220 ఎకరాలు భూమిని ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని కోరుతూ గత 15 సంవత్సరాల నుండి తహశీ ల్దార్, ఆర్డీవో కర్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయామన్నారు. ఆ సర్వే నెంబర్లు కొందరు దొంగ ఆన్లైన్ చేసుకుని లక్షల రూపాయలు బ్యాంకుల్లో రుణాలు పొందారని, దొంగ ఆన్లైన్‌లను వెంటనే రద్దు చేసి వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి ఎనిమిదవ విడత భూ పంపిణీ కార్యక్రమంలో బాలిరెడ్డిపల్లె ఎస్సీ, ఎస్టీలకు భూ పంపిణీ చేయాలని., లేనిపక్షంలో పిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముట్టడించి న్యాయం జరిగేవరకు కార్యాలయంలోనే వంట-వార్పు చేపడుతామని హెచ్చరించారు. వెంటనే స్పందించిన ఆర్డీవో రామకృష్ణారెడ్డి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారన్నారు. కార్యక్ర మంలో మహిళా సమాఖ్య రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి కృష్ణవేణి, పెనగలూరు మండల కార్యదర్శి ఆదినారాయణ, సిపిఐ నాయకులు బీదం రాజశేఖర్, సిపిఎం నాయకులు రమణ, మణి, లక్ష్మయ్య రవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా కృష్ణవేణి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని యర్రగుంట్లబావి ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కృష్ణవేణి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక య్యారు. ఉపాధ్యాయ వృత్తిలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తించి అవార్డుకు ఎంపికైనట్లు కడప జడ్పీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ ఆవార్డును ఈ నెల 5వ తేది అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కడప జడ్పీ కార్యాలయంలో అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాయచోటి

ఎంఆర్‌పిఎస్ జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిగా మదనపల్లికి చెందిన వైరవీంద్రను జిల్లా అధ్యక్షులుగా, కె.వి.పల్లి ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు వంగళ్ల శ్రీనివాసులును జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీకి ఎంపికైన వారు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలో అలుపెరగని పోరాటాలు చేస్తూ ఉద్యమాన్ని నిర్మాణాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాదిగ మహిళా నాయకులు స్వర్ణలత, ఎంఎస్‌పి తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుమ్ము చిన్న, పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, మదనపల్లి టౌన్ ఇన్‌ఛార్జి వై.రాజా, ఎంఆర్‌పిఎస్ మదనపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి రెడ్డిశేఖర్, ఎంఎస్‌పి కేవీ పల్లి మండలం కన్వీనర్ దొడ్డి వెంకటాచలపతి, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, పీలేరు ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి చరణ్ కుమార్, గాలివీడు మండలం మారుతి ప్రసాద్, రామసముద్రం మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, నిమ్మలపల్లి మండల కన్వీనర్ రెడ్డి నారాయణ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు బాబు, రాజేష్, చిన్ననాగప్ప, నాగరాజు, నరేష్, దేవ, నాగరాజు పాల్గొన్నారు.

నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ప్రభాకర్‌రెడ్డి

తపాలా ఉద్యోగుల సమ్మె జయప్రదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని, గ్రాట్యుటీ 5లక్షలకు పెంచాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఎఐజి డిఎస్‌యు, ఎన్‌యుజిడిఎస్‌యుల పిలుపుమేరకు బుధవారం ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మదనపల్లి పోస్టలు డివిజన్లో పూర్తిసమ్మె జరిగింది. స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం తమ కోర్కెలు తీర్చాలని నినాదాలుచేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సిఐటియు జిల్లా కోశాధికారి హరిశర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకరరెడ్డి హాజరై తమ సంఘీభావాన్ని సహకారాన్ని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. 8గంటల పనివిధాన్ని అమలుచేయాలని, గ్రాట్యుటీ 5 లక్షలు చెల్లించాలని, గ్రూపు ఇన్సూరెన్సు 5లక్షలకు పెంచి కార్మికులను ఆదుకోవాలని డిమాండు చేశారు. కేంద్రం పోస్టాఫీసులను, సిబ్బందినీ తగ్గించి పనిభారాన్ని పెంచుతున్నదని, ప్రైవేటీకరణ విధానాలను అవలంభిస్తున్నదని కార్మికులు ఐక్యంగా దీన్ని ఎదుర్కోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టలుయూనియన్ సీనియర్ నాయకులు ప్రభాకరరెడ్డి, అంజప్ప, ఏఐజి డిఎస్‌యు, ఎన్‌యు జిడిఎస్‌యు నాయకులు అమరనాథరెడ్డి, శివప్రసాద్, నాగభూషణం, అన్ని బ్రాంచి పోస్టుఆఫీసుల సిబ్బంది పాల్గొన్నారు. అన్ని పోస్టు ఆఫీసు లలో సమ్మె జరిగి లావాదేవీలు నిలిచిపోయాయి. సమ్మె జయప్రదం చేసిన సిబ్బందికి యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.

115 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ షిరిడి సాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 115మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 25మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ సాయిలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ నాగేశ్వర రావు అన్నారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్లకు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటుబెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని, ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించి, ఆటోలకు స్టిక్కరింగ్, పోలీస్ నెంబరు, ఇన్సూరెన్స్, ట్యాక్స్, పొల్యూషన్ తదితర వాటిని తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఆటోలో ఎక్కితే పోలీసులకు సమాచారం అందించాలని, సమా చారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆటోలో ఓవర్‌లోడు ప్రయాణాలు, ద్విచక్రవాహనాలపై ముగ్గురు, నలుగురు వెళ్లడం నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్ఐ క్రిష్ణమూర్తి, సిబ్బంది వేణు, మోహన, ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగేశ్వర రావు

తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్ల కీర్తి ఘనం

- వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్

మొల్ల స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న విసి సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

మొల్ల సాహితీ పీఠం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'మొల్ల సాహితీ స్మారక స్తూపం' ఆవిష్కరించుకోవడం మొల్ల కీర్తిని ఇనుమడింపజేసినట్లేనని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో బుధవారం మొల్ల సాహితీ పీఠం ఆధ్వర్యంలో 'మొల్ల సాహితీ స్మారక స్తూపం' ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి చింతా సుధాకర్ మాట్లాడుతూ మొల్లమాంబ సంస్కృత వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించి తెలుగు సాహిత్య చరిత్రలో తొలి కవయిత్రిగా స్థానం సంపాదించుకోగా ఆమె కీర్తిని చిరస్థాయిగా నిలిపిన ఘనత గానుగపెంట హనుమంతరావుకు దక్కుతుందన్నారు. బద్వేలు సమీపంలోని గోపవరాన్ని మొల్ల జన్మస్థలంగా గుర్తించి, ఆ ప్రాంతంలో మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడం వెనుక గానుగపెంట చేసిన కృషి అభినందనీయమన్నారు. మొల్ల పేరుపైన పీఠాన్ని ఏర్పాటు చేసి మొల్ల జయంతిని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తూ పురస్కారాలు ప్రదానం చేయడం విశేషమన్నారు. గానుగపెంట హనుమంతరావును ఘనంగా సత్కరించారు. పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఇటీవల యోగి వేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాకులో ఉన్న సమావేశ మందిరానికి 'మొల్ల సమావేశ మందిరం'గా నామకరణం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మొల్ల పేరు ప్రస్తావనకు వచ్చినపుడు గానుగపెంట హనుమంతరావు స్మరణకు వచ్చేలా విశేషంగా కార్యక్రమాలు చేస్తూ చరిత్రలో నిలిచిపోయారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ సాహిత్య నిలయంగా విరాజిల్లుతున్న బ్రౌన్ కేంద్రంలో మొల్ల సాహితీ స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఎంతో శ్రమకోర్చి స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసిన గానుగపెంట హనుమంతరావు అభినందనీయుడన్నారు. సాహితీ పరిమళాలు వెదజల్లేలా భవిష్యత్తులో ఈ స్తూపం నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య పి.రమాదేవి, విశ్రాంత తెలుగు పండితులు డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, వైస్‌ఛాన్సలర్ పి.ఎ నాగరాజు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, పి.చంద్రకిశోర్, జె.లక్ష్మన్న, అరుణ పాల్గొన్నారు.

'విశ్వం'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన ఇంటెలిపాట్ కంపెనీ వారు ఎంబిఎ చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.రమణారెడ్డి తెలిపారు. మొదటగా ఇంటెలిపాట్ హెచ్‌ఆర్ మంజునాథ్ మాట్లాడుతూ ఇంటెలిపాట్ కంపెనీ గురించి విద్యార్థులకు వివరించి, ఎంపికైన విద్యార్థులను బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్‌గా తీసుకుంటామని తెలిపారు. మూడు రౌండ్లు ఉంటాయని, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్, చివరిగా మేనేజర్ రౌండ్ ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మొదటి మూడు నెలలు ట్రైనింగ్ ఇస్తారని, ట్రైనింగ్ సమయంలో రూ.30 వేల జీతం ఇస్తారని, ట్రైనింగ్ పూర్తయిన తరువాత రూ.7.25 లక్షలు సంవత్సరానికి జీతం ఇస్తారని ప్లేసెమెంట్ ఆఫీసర్ కేదార్ గౌరవ్ తెలిపారు.

ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

దమ్ము ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో చూసుకుందామని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భఒంగా ఆయన మాట్లాడుతూ వైసిపికి దమ్ము ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోకి రావాలని అక్కడే తేల్చుకుందామని సవాల్ విసిరారు. దొడ్డిదారిలో కేసులు పెడుతూ తెలుగుదేశం నాయకులను భయపెట్టి పార్టీని బలహీన పరచాలనే మీ దుష్ట ఆలోచనలకు స్వస్తి చెప్పే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నామని పేర్కొన్నారు. వైసిపి పెట్టించే అక్రమ కేసులకు ఎవరు బయపడరని, అది కేవలం మీ దుర్మా ర్గపు ఆలోచన మాత్రమేనన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని అపహస్యం చేసేవిధంగా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న ఈ పిరికి పంద ముఖ్యమంత్రికి ప్రజలు ఓటుతో కచ్చితంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నారా చంద్రబాబు నాయుడుని జైలులో ఉంచి నువ్వు పొందే పైశాచిక ఆనందం నీకు ఎన్నో రోజులు ఉండదని, ఎన్నో తప్పులు చేసి నువ్వే బెయిల్ తీసుకొని బయట తిరుగుతున్నావు అని మా నాయకుడు ఏ తప్పూ చేయలేదని కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజుల ఖాదర్‌భాషా, వతన్ నిస్సార్, పట్టణ అధ్యక్షులు బొనమల ఖాదర్ వలీ, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, ఉమాపతిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి ,నరసింహారెడ్డి శివారెడ్డి, హరి, రియాజ్, సత్యారెడ్డి, రజాక్, జిశాన్,రమణ రవిరెడ్డి, అర్షద్ అయుం, రఫీ పాల్గొన్నారు

రిలే దీక్షల్లో టిడిపి నాయకులు

చెంచుపాడు వాల్మీకి బోయ నూతన కమిటీ

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని పెంచుపాడు కొండమీదపల్లిలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం గ్రామ కమిటీని రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవిందు అధ్యక్షతన, రాష్ట్ర కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్ పర్యవేక్షణలో నూతన కమిటీ నియామకం జరిగింది. ఈ కమిటీ నియామకంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మనపల్లి లక్ష్మన్న, జిల్లా కార్యదర్శి చన్నం వెంకటరమణ, కోళ్లబైలు గ్రామ గౌరవ అధ్యక్షులు కొత్తూరు చిన్న రెడ్డెప్ప, గ్రామ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కె.వెంకటరమణ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు కమిటీ నియమించారు. పెంచుపాడు గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.రాజన్న, గ్రామ అధ్యక్షులుగా కనమన్న, సురేంద్ర, ఉపాధ్యక్షులుగా బొడిమల్ల సుబ్రమణ్యం, గ్రామ ప్రధాన కార్యదర్శి కె.గుర్రప్ప, కోశాధికారిగా బి.ప్రసాద్, కార్యదర్శులుగా కె.జయరామ్, బి.రెడ్డెప్ప, కె.కృష్ణప్ప, బి.మల్లయ్య, కె.నారాయణస్వామి, పి.లక్ష్మీనారాయణ, బి.మల్లికార్జున, మారా రమణప్ప, కె.రామకృష్ణ, బి.గంగాధర, కె.సుధాకర్, కె.రెడ్డిరాజ, కె.గంగన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగినేని గోవిందు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘంను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడంతోపాటు ఎస్టీ సాధన కోసమే ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

విహార యాత్రకు ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఇతరులు ఎవరైనా వెళ్లే విధంగా పాండిచ్చేరి విహార యాత్రకు స్పెషల్ సర్వీసులు పంపుతున్నామని ఆర్టీసీ-2 డిపో మేనేజర్ నిరంజన్ తెలిపారు. రెండవ సర్వీసులను 13వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటలకు మదనపల్లిలో బయలుదేరి తెల్లవారి పాండిచ్చేరికి చేరుతుందని తెలిపారు. 14వ తేదీ రాక్ బీచ్, వైట్ సాండ్ బీచ్, లైట్ హౌస్, అరబిందో ఆశ్రమం, బాసిలిక చర్చ్, షాపింగ్ చూసుకొని, మరుసటిరోజు 15వ తేదీ ఉదయం 6.30 గంటలకు పాండిచ్చేర్రి నుండి మహాబలిపురం టెంపుల్, బీచ్ చూసుకొని, మధ్యాహ్నం వండలూరు జూ పార్కు చూసుకుంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6.30కు కంచిలో టెంపుల్, షాపింగ్ చూసుకొని, రాత్రి బయలుదేరి 16వ తేదీ తెల్లవారి 5.00 గంటలకు మదనపల్లి చేరుతుందని తెలిపారు. ఛార్జీ కేవలం రూ.2 వేలు మాత్రమేనని, అల్ట్రా డీలక్స్, 40 సీటింగ్, పుష్ బ్యాక్ సీట్లు, టీవీ సౌకర్యం ఉందన్నారు. దసరా సెలవులలో యాత్రలకు వెళ్లాలనుకునే వారు టికెట్లు త్వరగా బుక్ చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ర్యాలీ చేస్తున్న ఎపివివియు సంఘ సభ్యులు

పురుషులతో సమానంగా వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళా కూలీలకు పురుషులతో సమానంగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళ కార్యదర్శి శోభ అన్నారు. బుధవారం మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లి కాలనీలో వ్యవసాయ కూలీలతో సమావేశం నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. కరపత్రాల్లో ఉన్న డిమాండ్లను మహిళా కూలీలకు వివరించి, అవగాహన ర్యాలీని నిర్వహించామన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కూలీలను నైపుణ్యం గల కూలీలుగా ప్రభుత్వం గుర్తించి, వారికి ఉపాధి హామీ పథకంలో పాటు అన్ని పనుల్లో రోజుకు కనీస వేతనం రూ.850 గా నిర్ణయించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డులు కుటుంబానికి కాకుండా ప్రతికూలికి ఇవ్వాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క కూలికి సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని పేర్కొన్నారు. భూమిలేని నిరుపేదలకు ఒక్కొక్క కుటుంబానికి కనీసం ఐదు ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉన్న భూమిని పంపిణీ చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి గ్రామీణ మహిళలకు నెలకు ఐదు వేల రూపాయలు పింఛన్ ఇవ్వాలని, ఒంటరి స్త్రీలకు వయసుతో నిమిత్తం లేకుండా రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాదం భాస్కర్ రెడ్డి రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు.ఈ మేరకు సోమవారం సాయంత్రం కడప జిల్లాపరిషత్ కార్యాలయం నుండి ఆయనకు సమాచారం అందింది. ఉపాధ్యాయ వృత్తిలో చిత్తశుద్ధితో పని చేయడంతోపాటు గత అనేక సంవత్సరాలుగా పదవ తరగతి గణితంలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కడపలోని జడ్‌పి కార్యాలయంలో జడ్‌పి చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. భాస్కర్‌రెడ్డిని ఎస్‌టియు నాయకులు రమేష్ బాబు, భాస్కర్‌నాయుడు, సోమశేఖర్, శ్రీనివాసులు అభినందించారు.

దాదం భాస్కర్‌రెడ్డి

జోనల్ స్థాయి అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రామాపురం

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 5న కడప జడ్‌పి కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఆకేపాటి ట్రస్ట్ ద్వారా జోనల్ స్థాయి అవార్డుకు ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఎంఇఒ రామక్రిష్ణుడు తెలిపారు. మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులకు అవార్డు రావడం హర్షణీయమన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరస్వతిపల్లె పాఠశాలలో పనిచేస్తున్న రాణి కుమారి, మేడపల్లె పాఠశాలలో పనిచేయుచున్న ఆర్వి సౌభాగ్య లక్ష్మి గువ్వల చెరువు ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న పి.జంతియాజ్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పనిచేస్తున్న ఆనందరావు ఎంపిపిఎస్ నల్లగుట్టపల్లి పాఠశాలలో పనిచేయుచున్న మల్లెరెడ్డి, ఏకిలపల్లె పాఠశాలలో పని చేస్తున్న నారాయణరెడ్డి, ఎంపిపిఎస్ కాంపల్లె పాఠశాలలో పనిచేస్తున్న మల్లె శ్రీకి అవార్డులు రావడం పట్ల మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

మదనపల్లెను జిల్లా చేయకపోవడం చారిత్రాత్మక తప్పిదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎంతో చారిత్రక నేపథ్యం కలిగి, జిల్లాకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్న జిల్లాల పునర్విభజన ప్రక్రియలో మదనపల్లెను జిల్లాగా ప్రకటించకపోవడం వైసిపి నాయకుల చేతకానితనానికి నిదర్శనమని జెఎసి నాయకులు విమర్శించారు. మదనపల్లిని జిల్లాగా ప్రకటించాలని అప్పట్లో తంబళ్లపల్లి నియోజకవర్గం, బి.కొత్తకోటలో జెఎసి నాయకులు నిరసన తెలుపగా అక్రమ కేసులు బనాయించడంతో టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, ఆర్.జె.వెంకటేష్, పి.సురేంద్రయాదవ్, గుత్తికొండ త్యాగరాజు, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, సిపిఐ నాయకులు తోపు కృష్ణప్ప, కే.మురళి, మనోహర్ రెడ్డిలు బుధవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫర్వీన్ తాజ్ మాట్లాడుతూ మదనపల్లి జిల్లా ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కలని, వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఆర్థిక లావాదేవీల కోసం, స్వార్థచింతనతో మోసం చేశారన్నారు. ఉద్యమాలు అణచి వేసే క్రమంలో అఖిలపక్ష నేతలపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పిన ఘనత వైసిపిదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్.జె.వెంకటేష్,పి.సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు కలిగిన మదనపల్లెను జిల్లా చేయాలని లక్షలాది మంది ప్రజలు ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. జిల్లా కావాలని అడిగితే తప్పుడు కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు మదనపల్లి జిల్లాగా ప్రకటించాలని, లేని యెడల వచ్చే శాసనసభ ఎన్నికల్లో అపార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారని స్పష్టం చేశారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE,CHITTOOR
G.W.O.P.No. 258 of 2023

Between:
1.Jakkala Geethika
minor rep., by the 2nd Petitioner
2.Pasupuleti Parvathamma ..Petitioners
And:
NIL ...Respondents

GENERAL NOTICE

Please take notice that the minor 1st Petitioner Jakkala Geethika, D/o Late Jakkala Murali Krishna and Late Jakkala Aswini,aged about 14 years,Hindu, student,residing at Door No.9-294, Valmiki Veedhi, Madanapalle Town, Annamaial District, minor rep.,by the 2nd Petitioner who is the maternal grandmother of Jakkala Geethika. The petitioners have filed the petition seeking for permission to appoint the 2nd Petitioner as the guardian for the minor 1st petitioner Jakkala Geethika of the person and to maintain the movables mentioned in the schedule hereunder for the welfare and education of Minor 1st petitioner i.e to operate S.B Account on behalf of the minor 1st petitioner. If any person has objection to appoint the 2nd petitioner as guardian for the minor 1st petitioner, the may appear and raise their objections before the Hon'ble court on **31.10.2023 at 10.30 a.m**

SCHEDULE

Saving Bank A/c No.50037032303 in Saptagiri Grameena Bank,Angallu Bank in the name of Jakkala Aswani, W/o Murali krishna, Madanapalle, and there is outstanding balance of Rs.5,00,000-00 as on 20-12-2020 to the credit of the said account and the future intereset thereon.

Sd/-MOHAMMAD MUSTAFA
B.NAGA KUMAR
Advocates,Chittoor, Cell: 9885845706

నేడు అనంతయ్యగారిపల్లెలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లిలో గ్రామ సచివాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ఎంపిడిఒ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపిపి, వైస్ ఎంపిపి జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి నాయకులు, వార్డు మెంబర్లు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం జరిగిన జగనన్న ప్రభుత్వం చేసిన నిజమైన అభివృద్ధిని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలనే వైసిపి నాయకులు, కార్యకర్తలు చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే అనే అంశంపై అవగాహన, శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ దూర దృష్టిగల నాయకుడని రాష్ట్రం, అభివృద్ధి సంక్షేమం కోసం మరల ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు వైసిపి అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టించి పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి సంక్షేమ ఫలాలు అమయ్యేలా కృషి చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సిఎం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రాజు, వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి.డి.నాగేంద్రయాదవ్, ముస్తాక్, ఎపి టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర, జడ్‌పిటిసి రత్నమ్మ, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, ఉపసర్పంచ్ తోట శివసాయి, పట్టణ కన్వీనర్ రమేష్, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : జెసి

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-కలకడ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జెసిని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రాలకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించేందుకు శ్రమ లేకుండా గ్రామస్థాయిలో గ్రీవెన్స్ డే నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభమైన రీతిలో సమస్యలు పరిష్కరించేందుకు నడుము కట్టిందన్నారు. జెసితో పాటు ఆర్‌డిఒ రంగస్వామి పాల్గొని ప్రజా వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ ప్రదీప్,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జడ్‌పి ఉన్నతపాఠశాలలో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

స్థానిక మండలంలోని బాటవారిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలను డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా బుధవారం నుంచి జరుగుతున్న ఎఫ్ఎ-2 పరీక్షలు తనిఖీ చేసి ఉపాధ్యాయులు సిలబస్ ప్రకారం పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠశాలలో తరగతుల బోధన గూర్చి ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. నోట్స్ బుక్స్, వర్క్ బుక్ లను ఉపాధ్యాయులు కరెక్షన్ చేస్తున్నారా లేదా తనిఖీ చేశారు. ఐఎఫ్.పి ప్యానల్ బోర్డ్స్ ఉపాధ్యాయులు ఏ విధంగా ఉపయోగించు కుంటున్నారు, ఏ విధంగా పిల్లలకు అర్థం అయ్యేలాగా బోధించవచ్చునో తెలిపారు. పాఠశాలలో జగనన్న గోరుముద్దలు భాగంగా మధ్యాహ్నం భోజనాన్ని నాణ్యత పరిశీలించారు. ఇస్కాన్ అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో రుచికరంగా లేదని 70 మంది పిల్లల వరకు ఇస్కాన్ భోజనం తినడం లేదని గుర్తించారు. రెండవ విడత నాడు-నేడు పనులపై ఆరా తీశారు. రెండు లక్షల వరకు నిధులు తక్కువగా ఉన్నట్లు గుర్తించి త్వరలో ఆ నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ రెగ్యులర్ గా ఇస్తున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు.తన పాఠశాల సందర్శనలో సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ మునీందర్‌నాయక్, ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సరస్వతి, బోధనా సిబ్బంది వైవి.రమణ, అష్రఫ్, హైమావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ పురుషోత్తం

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి : ఎంపిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సంకల్ప సప్తహ సుపోషిత పరివార్ పోషణ న్యూట్రిషన్ మేళాలో భాగంగా బుధవారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా 75 మంది గర్భిణులకు సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలోని పిల్లలకు, బాలింతలకు, గర్భవతులకు మంచి ఆకుకూరలు అందించాలన్నారు. సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ కార్యక్రమాలపై అవగాహన కల్పించా లన్నారు.సెంటర్లలో పెరటి తోటలు ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సాగు చేయాలన్నారు. పెరటిలో సాగుచేసిన ఆకుకూరలు,కూరగాయలు, పండ్లు బాలింతలకు, గర్భిణులకు వండి పెట్టాలన్నారు. ప్రతి నెల పిల్లల పొడుగు, బరువులు తూకాలు వేయాలన్నారు. ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసనలు చేయించాలన్నారు. బాలామృతం, చిక్కీలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు బాగా ఉడికించి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ ఉదయశంకర్‌రాజు, అంగన్వాడీ సూపర్వైజర్లు దాదాబీ, అరుణ కుమారి, అరుణాదేవి, పద్మజ, హైమావతి లక్ష్మీదేవి, బిపిఎల్ లతా, ఎం.ఎస్.కె ప్రశాంతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.**రైల్వేకోడూరు** :స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ టిపి సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో సంకల్ప సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్స్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ నీతి ఆయోగ్ వారి ద్వారా భారత ప్రధాన మంత్రి ఆస్పిరేషన్స్ బ్లాక్ ప్రోగ్రాం ద్వారా 500 మండలాలను దేశ వ్యాప్తంగా ఎన్నిక చేశారని అన్నారు. రైల్వేకోడూరు మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రాజెక్టుగా ఎన్నిక చేశారన్నారు. గర్భిణులకు సీమంతం, అన్నప్రాసన, గర్భిణులకు బరు వులు చూడడం, ముఖ్యంగా రక్తహీనత అరికట్టడం లోప పోషణ లేకుండా చేయు టకు చిరుధాన్యాలతో తయారుచేసిన వివిధ రకాల వంటకాల ప్రదర్శనను మండలంలోని 115 అంగన్వాడీ కేంద్రంలో సంకల్ప సప్తాహ్ న్యూట్రిషన్ మేళ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణంలో పెరటి తోటల పెంపకం ద్వారా ప్రతి కుటుంబాలలోను మంచి పోషకాహారం తీసుకునే విధంగా అంగన్వాడీ కేంద్రాలలో న్యూట్రీషియన్ మేళా కార్యక్రమం నిర్వహించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ సరళదేవి, జడ్‌పిటిసి పి.రత్నమ్మ, వైసిపి టౌన్ కన్వీనర్ రమేష్, నాగేంద్ర, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సిడిపిఒ పద్మావతి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం : ఎమ్మెల్యే

బి.కొత్తకోట : జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పిటిఎం మండలం, బూర్లపల్లి గ్రామంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం, శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి, ఎంపిపి మహమ్మద్, జడ్‌పిటిసి శివన్న, వైసిపి మండల కన్వీనర్ గణపతి, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ములకల చెరువు :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. మండలం సొంపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పోలప్ప, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిపి సాయిలీల, సర్పంచులు రాంబాబు, ఎంపిటిసిలు ఆయేషా, చాంద్ బాషా, రేష్మా రఫీ, కృష్ణప్ప, నాయకులు అముదాల మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథ్, నాగరాజు, నాగేంద్ర, వైద్యులు, సూపర్వైజర్లు, ఎఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **మదన పల్లె అర్బన్ :** బసివి కొండలో నిర్వహించిన జగన న్న సురక్ష కార్యక్రమానికి ఆర్‌బికె చైర్మన్‌కత్తిరాజు, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపిడిఒ భానుప్రసాద్, తహశీల్దార్ మహబూబ్‌చాంద్, సిడిపిఒ సుజాత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు.ఈ శిబిరంలో డాక్టర్ పురాన్‌ఖాన్, డాక్టర్ ఝూన్సీలక్ష్మి, డాక్టర్ రామాంజులనాయక్, కంటి నిపుణుడు డాక్టర్ భాగ్యరాజ్ అనారోగ్యంతో శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు గంగాధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. **నందలూరు :** స్థానిక పంచాయతీ పరిధిలోని అరవపల్లి క్రీడా మైదానంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ ఆనాడు వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆదుకున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటింటికి స్పెషలిస్ట్ డాక్టర్లను పంపించి వైద్య సేవలు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఎంపి డిఒ, సర్పంచ్‌లు రోగులకు ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, ఎపిఒ వసుంధర, వైసిపి నాయకులు ఆర్ముగం విశ్వనాథ్, ఆకేపాటి రమేష్ రెడ్డి, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిడిఒ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. రెడ్డివారిపల్లి సచివాలయం-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపిపి నరసింహులు, సర్పంచు నూతనకాల్వ రెడ్డెమ్మ నరేంద్రరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు ఆర్.ఐ రమణారెడ్డి లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ దీక్షితారాణి, ఇతర వైద్య బృందం, వైఎస్‌ఆర్సిపి నాయకులు నరేంద్ర రెడ్డి, ఎంఎల్ హెచ్‌పి లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. **గాలివీడు:** ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకవచ్చారని వైస్ ఎంపిపి మిట్టపల్లి యధు భూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. గాలివీడు-1 సచివాలయం పరిధిలో పెద్దూరు కస్పాలోని ఉర్దూస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవితో పాటు ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ కన్వీనర్ ఎస్.కె ఖాదర్‌మోదీన్, డిటి తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ వైద్యులు, రఫిక్, స్రవంతి రెడ్డి, ఎఎన్‌ఎంలు ఆశ వర్కర్లు ల్యాబ్ అసిస్టెంట్లు వాలంటీర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట ఒక వరం లాంటిదని స్పెషల్ ఆఫీసర్ జిల్లా అధికారి స్కందప్ప , సర్పంచ్ సుధాకర్ రెడ్డి తెలిపారు. గోపిదిన్నె గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో మండలా అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎంఇఒ నాగ సుబ్బరాయుడు, మల్ రెడ్డి, ఆర్బికే చైర్మన్ మల్‌రెడ్డి, వైస్‌ఎంపిపి కరీం, నాయకులు కోటిరెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఎపిజిబి ఖాతాదారులకు అవగాహన

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని నగరిపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి)ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని తుమ్మకొండ గ్రామంలో నిర్వహించారు. ఘర్ ఘర్ కి కిసాన్ క్రెడిట్ కార్డ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్యాంకులో ఉన్నటు వంటి పథకాలు, రుణాలు, ఇన్సూరెన్స్ గురించి కళాసేనా కళాజాత బృందం ద్వారా పాటలు, మ్యాజిక్‌షో, గ్రామ ప్రజలకు చాలా చక్కగా తెలిపారు. కార్యక్ర మంలో బ్రాంచ్ మేనేజర్ ఓగిరాల వెంకటసాయి కృష్ణ, బ్యాంకు సిబ్బంది, గ్రామ ప్రజలు, కళాజాత బృందం సుధాకర్(మెజీషియన్), ప్రభాకర్(డప్పు) పాల్గొన్నారు.

దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయం వద్ద చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. బుధవారం చేపట్టిన నిరసన దీక్షకు సిపిఐ పార్టీ మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కక్ష సాధింపు చర్యలో భాగమే ఈ అక్రమ అరెస్టు అని ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. స్కిల్ కేసులో సాక్షాధారాలు లేకుండా అరెస్టు చేయడం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం బాధాకరమని అన్నారు. ఈ అక్రమ అరెస్టును ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికలలో ప్రజలు జగన్‌కు తగిన గుణపాఠం చెబుతారనిఅన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి సీనియర్ నాయకులు మాచినేని విశ్వేశ్వర నాయుడు,కట్టా గుండయ్యనాయుడు, కమతం నాగరాజు, కొమ్మ శివ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, హేమ రాజ్, రమేష్, జయప్రకాష్, వెంకటరమణ, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, పండుగోలు మణి టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పరాయి స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన భర్త తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పోలీసులు తనకు న్యాయం చేయాలని ఓ మహిళ తన గోడును విన్నవించుకుంది. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు సుజాత మాట్లాడుతూ తనది నిమ్మనపల్లి మండలం,ఎర్రాతివారి పల్లి తెలిపారు. 1999లో మదనపల్లి మండలం,వేంపల్లి పంచాయతీ,బండకాడపల్లికు చెందిన భాస్కర్‌తో వివాహమైందని, మాకు బీటెక్ చదివే ఓ కుమారుడు ఉన్నాడన్నారు. కొద్ది రోజులు మా కాపురం సజావుగానే సాగిందని, ఇటీవల కాలంలో మరొక స్త్రీతో తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని, తనను అనేక ఇబ్బందులు పెడుతున్నాడని పేర్కొన్నారు. తన కుమారుడు సైతం తన భర్తకే వత్తాసు పలుకుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. సమాజ సేవకులు బీరంగి రేవతి మాట్లాడుతూ సాంకేతికంగా దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ సుజాత లాంటి మహిళలు భర్త చేతిలో హింసకు గురవుతుండడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సుజాత భర్త భాస్కర్ తన మనసును మార్చుకొని భార్యను మంచిగా చూసుకోవాలని హితవు పలికారు. సుజాతకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు.

రోగుల సంతృప్తే ప్రభుత్వ లక్ష్యం

-ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న ఆరోగ్య సురక్షకు హాజరయ్యే రోగుల సంతృప్తే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనమాలకొండయ్య తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పూనం మాలకొండయ్య అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరయ్యే రోగుల సంతృప్తే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం పై ప్రజలందరికీ తెలిసే విధంగా వివిధ మార్గాలలో ప్రచారాన్ని చేపట్టాలని, కార్యక్రమం ఏర్పాటు చేసే ప్రదేశం విశాలంగా ఉండేటట్లు చూసుకోవాలని, ఫోల్డర్లు, బ్యాగుల కొరత లేకుండా ఉండాలని సూచించారు. కలెక్టర్ గిరీష పిఎస్ పూనం మాలకొండయ్య తో జిల్లాలో కార్యక్రమ వివరాలను తెలుపుతూ జగనన్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని అక్టోబర్ 4 వరకు జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో 73 చోట్ల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, పట్టణ ప్రాంతాలలో 3 చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ కొండయ్య, డిసిహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి మనోహర్ రాజు పాల్గొన్నారు.

హజ్ హౌస్‌కు నూతన శోభ

ప్రజాశక్తి-కడప అర్బన్

హజ్ హౌస్‌కు అన్నివిధాల మౌలిక వసతులు కల్పించి త్వరలో జిల్లా వాసులకు అందుబాటులోకి తెస్తామని డిప్యూటీ సిఎం అంజాజ్ బాషా అన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాలులో హజ్ హౌస రెన్నోవేషన్‌పై ఎపి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ అధికారులు, హజ్ హౌస్ కమిటీ సభ్యులతో డిప్యూటీ సిఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో నిర్మాణం జరిగి అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్ పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పది కోట్ల మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏపీ స్టేట్ హౌస్ కమిటీ ఇఒ అబ్దుల్ ఖాదర్, కడప హజ్ హౌస్ కమిటీ చైర్మన్ గౌస్లాజం, ఎపి అర్బన్ ఇన్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ అధికారులు అభిషేక్ బాలాజీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కలకడ

కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కోన పంచాయతీ కోనకు చెందిన నాగరాజును అదే గ్రామానికి చెందిన నాగయ్య వారి సోదరుడు శ్రీరాములు కలిసి ఘర్షణపడి నాగరాజును కత్తితో దాడి చేసి గాయపరిచాడన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన నాగరాజును 108 వాహనంలో మదనపల్లికి తరలించి వైద్యం చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారని అన్నారు. నాగరాజ భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కత్తిపోటుకు గురైన వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.